# ఐటీఎఫ్ జూనియర్ చాంప్ రిషిత

• గర్ల్స్ సింగిల్స్ టైటిల్ కైవసం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్-జే100 బాలికల సింగిల్స్ టైటిల్‌ను తెలంగాణ అమ్మాయి బసిరెడ్డి రిషిత రెడ్డి కైవసం చేసుకుంది. ఢిల్లీలో గత నెల 25-30 తేదీలలో జరిగిన ఈ టోర్నీలో భాగంగా ముగిసిన గర్ల్స్ సింగిల్స్ ఫైనల్స్‌లో రిషిత.. 4-6, 6-4, 6-3తో నెల్లి ఇవానోవా (రష్యా)ను చిత్తు చేసింది. ఈ టోర్నీ తొలి రౌండ్ నుంచి ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తూ ఫైనల్ చేరిన రిషిత.. తుదిపోరులో తొలి సెట్‌ను కోల్పోయినప్పటికీ తర్వాత పుంజుకుని రష్యా అమ్మాయిని ఓడించింది. ఐటీఎఫ్ జూనియర్ ర్యాంకిం గ్స్‌లో భాగంగా తెలంగాణలో అగ్రస్థానంలో ఉన్న రిషిత.. భారత్‌లో 3వ ర్యాంకును కలిగిఉంది. ఈ నెల 16-19 తేదీలలో జరుగబోయే ఇంటర్నేషనల్ లాన్ టెన్నిస్ క్లబ్ రాడ్ లీవర్ క్లబ్‌లో రిషిత భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనుంది.

# ఐసీసీలో మొదలైన జై షా శకం

## అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరణ



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నూతన అధ్యక్షుడిగా జై షా ఆదివారం (డిసెంబర్ 1న) బాధ్యతలు స్వీకరించారు. గ్రెగ్ బార్క్‌లే స్థానాన్ని భర్తీ చేసిన 36 ఏండ్ల షా.. ఈ పదవిని చేపట్టిన అతి పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కారు. రెండేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగే ఆయన భారత్ నుంచి ఈ ఘనత సాధించిన ఐదో భారతీయుడిగా నిలిచారు. గతంలో జగ్మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్. శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ బాధ్యతల్లో పనిచేశారు. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన ఐసీసీ అధ్యక్ష ఎన్నికలలో షా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జై షా స్పందిస్తూ.. ఈ పదవిని చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. తన అభ్యర్థిత్వాన్ని ఆమోదించిన డైరెక్టర్లు, ఇతర దేశాల బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 2028లో జరుగబోయే లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడమే తన ముందున్న ప్రధాన కర్తవ్యమని జై షా వెల్లడించారు. కాగా అధ్యక్షుడిగా షా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో త్వరలోనే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (పాకిస్థాన్, హైబ్రిడ్ మోడల్) షెడ్యూల్‌పై ప్రకటన వెలువడే అవకాశముంది.

రెండేండ్ల తర్వాత టైటిల్ గెలిచిన తెలుగమ్మాయి

# చాంపియన్స్ సింధు, సేన్

పురుషుల సింగిల్స్‌లో మెరిసిన లక్ష్య • మహిళల డబుల్స్‌లో త్రిసా-గాయత్రి ద్వయం అదుర్స్ • సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీ







లక్నో: తెలుగమ్మాయి, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు రెండేండ్ల బీడబ్ల్యూఎఫ్ టైటిల్ నిరీక్షణకు ఎట్టకేలకు తెరదించింది. స్వదేశంలో జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఆమె టైటిల్ గెలిచింది. లక్నో వేదికగా ముగిసిన ఈ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్‌లో సింధు.. 21-14, 21-16తో వు లు యు (చైనా)పై గెలిచింది. తద్వారా ఆమె ఈ టోర్నీని మూడుసార్లు నెగ్గినట్టైంది. 2017, 2022లోనూ ఆమె ఈ టోర్నీలో విజేతగా గెలిచింది. గతంలో సైనా నెహ్వాల్ మాత్రమే ఈ టోర్నీలో మూడుసార్లు విజేతగా నిలవగా తాజాగా సింధు ఆమె రికార్డును సమం చేసింది. సింధూతో పాటు పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ ద్వయం టైటిల్స్‌ను సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో లక్ష్యసేన్.. 21-6, 21-7తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై అలవోక విజయం సాధించాడు. మహిళల డబుల్స్‌లో త్రిసా-గాయత్రి జోడీ.. 21-18, 21-11తో బావో లి జింగ్-లీ కియాన్ (చైనా)ను చిత్తు చేసి తొలిసారి సూపర్ 300 టైటిల్‌ను కైవసం చేసుకుంది.

**సింధు ఆధిపత్యం..**

గత రెండేండ్లుగా బీడబ్ల్యూఎఫ్ టైటిల్ వేటలో ఉన్న సింధు.. ఈ టోర్నీ ఆసాంతం అదరగొట్టింది. ఇరా శర్మ, ఉన్నతి హుడా వంటి యువ భారత షట్లర్లు ఆమెకు కఠిన పోటీనిచ్చినా వారిని అధిగమిస్తూ ఫైనల్ చేరింది. తుదిపోరులో ఆమె.. తొలి గేమ్ బ్రేక్ సమయానికి 11-9తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ఆమె జోరు పెంచి గేమ్‌ను సొంతం చేసుకుంది. కానీ రెండో గేమ్‌లో చైనా అమ్మాయి పుంజుకునేందుకు యత్నించింది. ఒకదశలో వు.. 11-10తో ఆధిక్యంలో ఉన్నా సింధు గేర్ మార్చింది. వు చేసిన తప్పిదాలను పసిగట్టిన ఆమె.. తనదైన స్మాష్‌లు, ఫోర్ హ్యాండ్ షాట్లతో విరుచుకుపడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. గత కొంతకాలంగా పలు టోర్నీలలో సెమీస్‌కు చేరిన సింధు.. కీలక మ్యాచ్‌లలో విఫలమైనా ఈ టోర్నీలో మాత్రం ఆ తప్పులను పునరావృతం కాకుండా చూసుకుంది.

ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌లో లక్ష్యసేన్ దుమ్మురేపాడు. సేన్ దూకుడుకు ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన కూడా ఎదురుకాలేదు. మ్యాచ్ ఆద్యంతం అతడిదే ఆధిపత్యం. రెండు గేమ్స్‌లోనూ ప్రత్యర్థి 5 పాయింట్లు కూడా చేరకుండానే సేన్ విజయం దాదాపు ఖరారైంది.

పురుషుల, మహిళల సింగిల్స్, మహిళల డబుల్స్‌లో అదరగొట్టిన భారత్‌కు మిక్స్‌డ్ డబుల్స్‌తో పాటు పురుషుల డబుల్స్‌లో నిరాశ ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల్ జంట.. 21-18, 14-21, 8-21తో డెచాపోల్-సుపిస్సర (థాయ్‌లాండ్) చేతిలో పరాభవం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి-సాయి ప్రతీక్ ద్వయం.. 14-21, 21-19, 17-21 తో హువాంగ్ డి - లియు యాంగ్ (చైనా) చేతిలో ఓడింది.

# ఇంగ్లండ్ ఘనవిజయం

క్రిస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో క్రిస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ ఘనవిజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ నిర్దేశించిన 104 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లీష్ జట్టు.. 12.4 ఓవర్లలోనే దంచేసింది. జాకబ్ బెతెల్ (50 నాటౌట్), బెన్ డకెట్ (27), జో రూట్ (23 నాటౌట్) ధాటిగా ఆడి ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చారు. ఈ టెస్టులో బంతితో పాటు బ్యాట్‌తోనూ రాణించిన ఇంగ్లండ్ ఆటగాడు బ్రైడన్ కార్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపైర్‌గా రాజేందర్



కేసముద్రం, డిసెంబర్ 1: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న కొమ్ము రాజేందర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపైర్‌గా ఎంపికైనట్టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌కుమార్, రమేశ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజేందర్.. గౌహతి (అసోం)లో జరుగనున్న ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపైర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.

# కరాటే చాంపియన్‌షిప్‌లో మెరిసిన తెలంగాణ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: గత నెల 28 నుంచి డిసెంబర్ 1 దాకా దక్షిణాఫ్రికాలోని డర్బన్ వేదికగా జరిగిన 11వ కామన్‌వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణ కరాటే క్రీడాకారులు పతకాల మోత మోగించారు. ఆడుతున్న తొలి టోర్నీలోనే రాష్ర్టానికి చెందిన రామినేని రోహన్, అమ్రది విశాల్ రెడ్డి, తాళపత్రి ఆరాధ్య పతకాలు గెలిచి చరిత్ర సృష్టించారు. 63 కిలోల విభాగంలో రోహన్ స్వర్ణం గెలవగా 57 కిలోల కేటగిరిలో విశాల్ కాంస్యం నెగ్గాడు. 42 కిలోల విభాగంలో ఆరాధ్య స్వర్ణం గెలిచింది. అంతేగాక ఆమె అండర్-14 విభాగంలోనూ కాంస్యం సొంతం చేసుకుంది.

# టీమ్‌ఇండియా విజయం

ప్రైమ్ మినిస్టర్ లెవెన్‌పై గెలుపు • రీఎంట్రీలో అదరగొట్టిన గిల్



కాన్‌బెర్రా: అడిలైడ్‌లో డే అండ్ నైట్ టెస్టుకు సిద్ధమవుతున్న భారత జట్టుకు ఆ మ్యాచ్ ఆరంభానికి ముందు మరో విజయం దక్కింది. ప్రైమ్ మినిస్టర్ లెవెన్‌తో కాన్‌బెర్రాలో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండు రోజుల ఆటలో భాగంగా తొలి రోజు వర్షార్పణమవగా రెండో రోజూ వరుణుడి అంతరాయంతో మ్యాచ్‌ను 46 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన పీఎం ఎలెవెన్.. 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టు ఓపెనర్ సామ్ కొన్‌స్టస్ (97 బంతుల్లో 107, 14 ఫోర్లు, 1 సిక్స్), హన్నో జాకబ్స్ (61) రాణించారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా (4/44), ఆకాశ్ దీప్ (2/58) మెరిశారు. అనంతరం భారత్.. 46 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. నిర్ణీత ఓవర్ల కంటే ముందే టీమ్‌ఇండియా మ్యాచ్ గెలిచినా ప్రాక్టీస్ మ్యాచ్ కావడంతో పూర్తి ఓవర్ల పాటు ఆడించారు. పెర్త్ టెస్టుకు ముందు వేలిగాయంతో దూరమైన శుభ్‌మన్ గిల్ (62 బంతుల్లో 50 రిటైర్డ్ హర్ట్, 7 ఫోర్లు) ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు వచ్చి అడిలైడ్ టెస్టుకు తాను సిద్ధమేనని చెప్పకనే చెప్పాడు. యశస్వీ జైస్వాల్ (45), నితీశ్ రెడ్డి (42), వాషింగ్టన్ సుందర్ (42 నాటౌట్) భారత విజయంలో కీలకపాత్ర పోషించారు.



*68వ హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2024-25లో భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్స్ (జూబ్లీహిల్స్) సత్తా చాటింది. రోడ్ రేస్ 1 ల్యాబ్‌లో రెండో స్థానంలో నిలిచిన చిట్టా లోకేశ్వర్ విన్యాసాలివి..*

# ఆరోదీ డ్రానే..

• ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డ్రా ల పర్వం కొనసాగుతోంది. గుకేశ్, లిరెన్ మధ్య జరుగుతున్న ఈ మెగా టోర్నీ ఆరో రౌండ్‌ను ఇరువురు ఆటగాళ్లు డ్రాగా ముగించారు. తొలి మ్యాచ్‌లో లిరెన్ నెగ్గగా మూడో మ్యాచ్‌లో గుకేశ్ గెలిచాడు. 2, 4, 5వ మ్యాచ్‌లు డ్రా కాగా తాజాగా వరుసగా మూడో మ్యాచ్ లోనూ అదే ఫలితం పునరావృతమైంది. 46 ఎత్తుల తర్వాత డ్రాకు ఇరువురూ అంగీకరించారు. 6 గేమ్‌లు గుకేశ్, లిరెన్ తలా 3 పాయింట్లతో (ముందుగా 7.5 పాయింట్లకు చేరినవారు విజేతగా నిలుస్తారు) కొనసాగుతున్నారు. కాగా మరో 8 గేమ్‌లు మిగిలున్న ఈ టోర్నీలో 8 మ్యాచ్‌ల తర్వాత ఇరువురికి సమాన పాయింట్లు ఉంటే అప్పుడు టై బ్రేక్ గేమ్స్‌కు అదనపు రోజును కేటాయించే అవకాశముంది. దాదాపు సగం దశకు చేరుకున్నప్పటికీ గుకేశ్, లిరెన్ ఇద్దరూ డ్రా లకు మొగ్గుచూపుతుండటంతో రాబోయే మ్యాచ్‌లలో పోరు మరింత రసవత్తరంగా ఉండటం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

చిత్రం




# సంగీతం ఉన్నంతకాలం ఘంటసాల ఉంటారు

'**ఘంటసాలను** శతాబ్ది గాయకుడు అంటారు. సంగీతం ఉన్నంతకాలం ఆయన జనహృదయాల్లో ఉంటారు. భగవద్గీత గానాన్ని ప్రపంచానికి అందించిన తొలి తెలుగు స్ఫూర్తి ఘంటసాల. భావితరాలకు ఆయన ఆదర్శప్రాయుడు. వారి జీవితం ఆధారంగా తీసిన ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. ఆర్థిక దృక్కోణంతో కాకుండా, సామాజిక చైతన్యం కలిగించేందుకు, ఒక సుమధుర గాయకుడి జీవితాన్ని తెరపై ఆవిష్కరించాలనే గొప్ప తలంపుతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాతలకు అభినందనలు. ఘంటసాలగా నటించిన కృష్ణచైతన్యనూ, శ్రీమతి ఘంటసాలగా నటించిన మృదులను ప్రత్యేకంగా అభినందిస్తున్నా.' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితానికి తెరరూపాన్నిస్తూ రూపొందిన బయోపిక్ 'ఘంటసాల దిగ్రేట్'. కృష్ణచైతన్య టైటిల్ రోల్ పోషించారు. ఘంటసాల సతీమణి సావిత్రిగా కృష్ణచైతన్య భార్య మృదుల నటించారు. సీహెచ్ రామారావు దర్శకుడు. సీహెచ్ ఫణి నిర్మాత. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేయనున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ని ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పై విధంగా స్పందించారు. ఈ సినిమాతో ఈ టీమ్ జన్మ ధన్యమైందని, ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని, అలాగే.. ఎన్టీఆర్‌కు కూడా భారతరత్న ప్రకటించాలని నట, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఇంకా దర్శకుడు సీహెచ్ రామారావు కూడా మాట్లాడారు. సుమన్, సుబ్బరాయశర్మ, దీక్షితులు, మాస్టర్ అతులిత్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: వేణు మురళీధర్.వి, సంగీతం: వాసురావు సాలూరి.

# కథానాయకుడిగా 80 ఏండ్లు



**1941లో** వచ్చిన 'ధర్మపత్ని' చిత్రంతో తెరంగేట్రం చేసిన మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు, 1944 డిసెంబర్ 1న విడుదలైన 'శ్రీసీతారామజననం' సినిమాతో హీరోగా మారారు. అంటే ఆ సినిమా వచ్చి నిన్నటితో 80ఏండ్లు పూర్తయ్యాయి. ఘంటసాల బలరామయ్య స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో అక్కినేని కల్యాణరాముడిగా అలరించారు. ఆ సినిమా విడుదలైన నాటికి అక్కినేని వయసు అక్షరాలా 20 ఏండ్లు. అప్పటికి అత్యంత పిన్నవయస్కుడైన కథానాయకుడు అక్కినేనే కావడం విశేషం. అంతేకాక, ఆయన హీరోగా నటించిన తొలి పాత్ర శ్రీరాముడి పాత్ర కావడం మరో విశేషం. ఈ సినిమాలో పద్యాలను అక్కినేని స్వయంగా ఆలపించారు. హీరోగా 'శ్రీసీతారామజననం'తో మొదలైన అక్కినేని నట ప్రస్థానం దశాబ్దాల పాటు అద్వితీయంగా సాగింది. అనితరసాధ్యమైన పాత్రలను పోషించి, దేశం గర్వించదగ్గ మహానటుడిగా ఆయన ఎదిగారు. కోట్లాదిమంది హృదయాలను గెలుచుకున్నారు. ఒక్క 'భారతరత్న' మినహా.. అన్ని ప్రభుత్వ పురస్కారాలనూ అందుకున్న మేటి నటుడు నటసామ్రాట్ డా.అక్కినేని నాగేశ్వరరావు. భారత సినీ చరిత్రలో ఆయనదో సువర్ణాధ్యాయం.

# యువ దర్శకునితో మెగా ప్రాజెక్ట్?



**ఒక్క** సినిమా డైరెక్ట్ చేసిన వశిష్టకు, తన సినిమాను డైరెక్ట్ చేసే ఛాన్స్ ఇచ్చేశారు చిరంజీవి. ఆ సినిమానే 'విశ్వంభర'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదిలావుంటే.. 'విశ్వంభర' తర్వాత మరో కుర్ర డైరెక్టర్‌తో సినిమా చేయనున్నారట చిరంజీవి. తనెవరో కాదు, 'దసరా'తో నానికి భారీ విజయాన్ని ఇచ్చిన శ్రీకాంత్ ఓదెల. ప్రస్తుతం నానితోనే 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు శ్రీకాంత్. ఈ సినిమా తర్వాత మెగా మూవీకి ఆయన రెడీ అవుతారనేది లేటెస్ట్ న్యూస్. ఇటీవలే చిరంజీవికి ఆయన ఓ కథ వినిపించారని, ఆ కథ చిరంజీవికి కూడా బాగా నచ్చిందని, బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేయమని శ్రీకాంత్‌ని చిరంజీవి ఆదేశించారనేది ఫిల్మ్‌వర్గాల్లో బలంగా వినిపిస్తున్న టాక్. చిరంజీవి 'విశ్వంభర', శ్రీకాంత్ ఓదెల 'ప్యారడైజ్'.. ఈ రెండు సినిమాలు పూర్తయ్యాక, ఈ మెగా ప్రాజెక్ట్ ఉంటుందట. ఈ వార్త ఫిల్మ్ వర్గాల్లో పొక్కడంతో కుర్ర డైరెక్టర్లకు అవకాశాలిస్తూ భిన్నమైన ప్రయాణాన్ని చిరంజీవి సాగిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు



*రజనీకాంత్ 'జైలర్'లో 'వా.. కావాలయ్యా.. దా.. దా..' అంటూ ఐటమ్ నంబర్లో చెలరేగిపోయింది తమన్నా. ఆ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా.. ఆ పాట, అందులో తమన్నా నాట్యాభినయం కొన్ని నెలలపాటు సోషల్ మీడియాను కుదిపేశాయనే చెప్పాలి. రీసెంట్‌గా 'స్త్రీ 2'లో కూడా ఓ చిన్న పాత్ర చేశారు తమన్నా. అందులో కూడా 'ఆజ్ కీ రాత్..' పాటలో సందడి చేశారు. ఆ సినిమా ఏకంగా 900కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో 'తమన్నా ఐటమ్ సాంగ్ చేస్తే సినిమా హిట్' అనే సెంటిమెంట్ మొదలైంది. మామూలుగానే సినిమావాళ్లకు సెంటిమెంట్లు ఎక్కువ. అందుకే.. దర్శక, నిర్మాతలంతా ఐటమ్ సాంగ్స్ చేయమంటూ తమన్నా ఇంటిముందు క్యూ కడుతున్నారట. దాంతో తమన్నా అసహనం వ్యక్తం చేశారు. రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను చేసిన పాటలు ఆ సినిమాల సక్సెస్‌లకు హెల్ప్ అవ్వడం ఆనందంగానే ఉంది. అందుకని, వరుసగా ఐటమ్ నంబర్లే చేయమంటే ఎలా? 'జైలర్' రజనీసార్ సినిమా అవ్వడంతో ఇష్టంతో చేశా. 'స్త్రీ2' డైరెక్టర్ అమర్ కౌశిక్ నాకు మంచి ఫ్రెండ్. తను అడగ్గానే కాదనలేక చేశా. అంతేతప్ప అదేపనిగా ఈ తరహా పాటలు చేయడానికి నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు..' అంటూ అసహనం వ్యక్తం చేసింది తమన్నా భాటియా.*

# ఫ్రెష్ అండ్ యూనిక్ క్యారెక్టర్‌లో



**భిన్నమైన** పాత్రలను ఎంచుకుంటూ స్టార్‌గానే కాక, నటుడిగా కూడా సత్తా చాటుతున్నారు వరుణ్‌తేజ్. ఆయన తాజా సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ కలిసి ఈ భారీ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నది. వచ్చే ఏడాది మార్చిలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని మేకర్స్ తెలియజేశారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా వంటి బ్లాక్‌బస్టర్స్ అందించిన దర్శకుడు మేర్లపాక గాంధీ.. వరుణ్‌తేజ్ కోసం అద్భుతమైన స్క్రిప్ట్ తయారు చేశారని, ఈ ప్రాజెక్ట్‌లో ఫ్రెష్ అండ్ యూనిక్ క్యారెక్టర్‌లో వరుణ్ కనిపించనున్నారని వారు తెలిపారు.

# ఆ వార్తలో నిజమెంత?



**ప్రస్తుతం రవితేజ** 'మాస జాతర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మే9న విడుదల కానుంది. ఇదిలావుంటే.. రవితేజ లైనప్ విషయంలో ఓ క్రేజీ న్యూస్ ఒకటి వినిపిస్తున్నది. తమిళంలో ఓ స్టార్ హీరో నటిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమాలో ప్రత్యేక పాత్ర చేయడానికి రవితేజ అంగీకరించారట. వివరాల్లోకెళ్తే.. సూర్య కథానాయకుడిగా ఆర్.జె. బాలాజీ దర్శకత్వంలో ఓ భారీ పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలోనే రవితేజ స్పెషల్ రోల్ చేయనున్నారట. ఇటీవలే రవితేజకి దర్శకుడు బాలాజీ క్యారెక్టర్‌ని నరేట్ చేశారని, పాత్ర నచ్చడంతో నటించేందుకు రవితేజ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ విషయం ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత ఏడాది చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ స్పెషల్ రోల్ చేసిన విషయం తెలిసిందే.

# ఇదో భావోద్వేగ ప్రయాణం



**మోస్ట్ ఎవైటెడ్** ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ముఫాసా- ది లయన్ కింగ్'. బారీ జెంకిన్స్ దర్శకుడు. 2019లో వచ్చిన యానిమేటెడ్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్'కి కొనసాగింపుగా వాల్ట్ డిస్నీ పిక్చర్స్ పతాకంపై ఈ సినిమా రూపొందింది. ఇందులో ప్రధాన పాత్ర అయిన 'ముఫాసా'కి అగ్ర హీరో మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఈ సినిమా పోస్టర్‌ని ఆదివారం హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నమ్రత మాట్లాడుతూ 'ఇది ఫ్యామిలీ ఎమోషనల్ రైడ్. మహేశ్ చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.' అని తెలిపారు. ఇంకా ఇందులోని కీలక పాత్రలైన టాకా, టిమోన్ పాత్రలకు వాయిస్ ఓవర్స్ ఇచ్చిన సత్యదేవ్, అలీ కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. ఇందులోని పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి.శర్మ వాయిస్ ఓవర్స్ ఇచ్చారు. డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.